క్లుప్తంగా

పోలేరమ్మ సేవలు అభినందనీయం



తెనాలిఅర్బన్: పోలేరమ్మ ఆర్టీసీ కండక్టర్‌గా అందించిన సేవలు అభినందనీయమని డిపో మేనేజర్ ఏ.రాజశేఖర్, ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. పోలేరమ్మ పదవీ విరమణ సభను ఆర్టీసీ డిపోలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారుల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ అభివృద్ధికి ఆమె చేసిన కృషి మరువరానిదన్నారు. అనంతరం పోలేరమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండపాటి శంకరరావు, నాయకులు ఎన్‌వి. కృష్ణారావు, వాకా రమేష్, షేక్ కరిముల్లా, ఎన్.హనుమంతరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మనోరమ కుమారి సేవలు మరువలేనివి



కొల్లిపర: 27 ఏళ్లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా విద్యార్థులకు విశిష్ట సేవలందించిన పప్పల మనోరమ కుమారి సేవలు మరువలేనివని ఎంఈవో-1 సాల్మాన్ రాజు, ఎంఈవో-2 ఝాన్సీలత పేర్కొన్నారు. మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న మనోరమ కుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం తెనాలి హోటల్ గ్రాండ్ గౌతమ్‌లో ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎంఈవోలు మాట్లాడారు. తెనాలి ఎంఈవో2 జయంత్ బాబు, యూటీఎఫ్ ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ టి.మల్లేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు కె.బెనహర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యుడిగా నాసర్‌జీ ఎన్నిక


లక్ష్మీపురం: తిరుపతిలోని బైరాగి పట్టెడలో గల సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాల్ని ఈనెల 29,30 తేదీల్లో జాతీయ అధ్యక్షుడు విక్కీ మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నగరానికి చెందిన ఏఐఎస్‌ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. నాసర్‌జీ ఎన్నికపై నగరానికి చెందిన విద్యార్థి యువజన సంఘాల నయకులు హర్షం వ్యక్తం చేశారు.

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE : TENALI
Detor I.P.No.15 / 2024
Between:-
Jarjhyam Hari Narayana -- Petitioner
And
1.Vandavesi Srinivasarao, S/o Venkateswara Rao, Tenali, 2.Tiruveedula Ramesh, S/o Narasimha Rao, Tenali, 3.Gurram Prasad, S/o Chinna, Tenali, 4.T.Kondalarao, S/o. T.S Rao, Tenali, 5.Kota Subrahmanyam S/o Hanumantha Rao, Tenali, 6.Manduri Udaya Bhasker, S/o Srinivasa Rao Tenali, 7.Daka SambiReddy S/o Reddy Tenali, 8.Poisetty Suresh S/o Subbarao Tenali, 9.Annaluri Kali Ramakrishna prasad S/o. A.K.Rao, Rayudupet, 10.P.Anand, S/o. Prabhakar, Tenali, 11.Manipalli Lazar S/o. Salman, Burrumalli, 12.J.Bhaskar, Son-in-Law of Lazar, Ponnumarru, 13.Dasari Venkata Lakshmi Srimannarayan, S/o. D.V.L.S, Tenali, 14.V.Srinivasacharyulu S/o. Achari, Tenali, 15.Kothamasu Bharath S/o. Apparao, Tenali, 16.Dogiparthy Satya narayana, S/o Narasimha Rao, Tenali 17.D.V.L Ganapathi S/o SubbaRao Tenali
--Respondents
[illegible]
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
ఎ.విజయ కుమారి, యం.శ్రీనాథ్‌రెడ్డి
సెల్ : 8501976789

పౌరాణిక నాటక ఆణిముత్యాలు

• ఏవీ సుబ్బారావు • చింతలపూడి చెంచయ్య

• నేడు చింతలపూడి చెంచయ్యకు 'గానకోకిల' ఏవీ సుబ్బారావు వార్షిక అవార్డు ప్రదానం



ఏవీ సుబ్బారావు



పౌరాణిక పాత్రలో ఏవీ సుబ్బారావు



చింతలపూడి చెంచయ్య

తెనాలి: తన పద్యగానంతో పౌరాణిక నాటక రంగాన్ని ప్రకాశింపజేసిన ఆణిముత్యాల్లో తెనాలికి చెందిన 'గానకోకిల' ఏవీ సుబ్బారావు ఒకరు. శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు పాత్రలతో అర్ధ శతాబ్దం పాటు నాటక ప్రియులను అలరించిన ఆ కళా ప్రముఖుడి 94వ జయంతిని జులై 1న నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే సభలో ఏవీ సుబ్బారావు 13వ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు ప్రదానం చేయనున్నారు. ఇదే వేదికపై కళాకారుల సత్కారం, మధ్యాహ్నం 2 గంటల్నుంచి వివిధ పౌరాణిక నాటకాల సీన్లను ప్రదర్శిస్తారు. ఏవీ సుబ్బారావు రంగస్థల సమాఖ్య వారి శ్రీ పూర్ణశ్రీ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో పలువురు కళారంగ ప్రముఖులు పాల్గొంటారు. ఏవీ సుబ్బారావుగా రంగస్థల ఖ్యాతి పొందిన ఆరాధ్యుల వెంకట సుబ్బారావు స్వస్థలం తెనాలి సమీపంలోని అనంతవరం. పేద రైతు కుటుంబం. పెద్దగా చదివిందీ లేదు. పొలం పనులతోనే జీవనం. నాటకాలపై ఆసక్తి ఆయనను కళాకారుడిని చేస్తే, నిరంతర శ్రమ, కఠోర దీక్ష ఎంతో ఎత్తుకు ఎదిగేలా చేశాయి. గ్రామంలో పక్క బజారులో ఉండే రంగస్థల నటుడు కుప్పా సూర్యనారాయణ శిష్యరికంతో సుబ్బారావు కళామతల్లి సేవకు అంకితమయ్యాడు. శ్రీరాముడు పాత్రకు పద్యాలు, పాటలు, సంభాషణలను వంట పట్టించుకున్నారు. 'బాలనాగమ్మ' ఫేం వల్లూరి వెంకట్రామయ్య ఆహ్వానంపై రెండేళ్లు ఆ బృందంలో 'కార్యవర్ధిరాజు'గా నటించారు. ఆ క్రమంలో 1958లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పద్యనాటక పోటీల్లో 'పాండవోద్యోగ విజయం' నాటకంలో ఏవీ సుబ్బారావు శ్రీ కృష్ణుడుగా వేశారు. సుబ్బారావు అద్భుత ప్రదర్శనతో మరోసారి అక్కడే నాటకం ఏర్పాటు చేసి, పూర్తయ్యాక, ఏవీ సుబ్బారావును 75 తులాల వెండి కిరీటంతో సత్కరించారు. ఇక అప్పటి నుంచి ఏవీ సుబ్బారావు వెనుదిరిగి చూడలేదు. ఆంధ్ర రాష్ట్రమంతా ఆయన పద్య గానంలోని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించింది. 1960లో శ్రీ పూర్ణశ్రీ నాట్యకళా సమితిని స్థాపించారు.ఈ సమాజంలోనే 30 ఏళ్లపాటు నాటక ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా ఢిల్లీ, ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని ముఖ్య పట్టణాల్లో ప్రదర్శనలిచ్చారు. మూడు తరాల కళాకారులతో నటించిన మరో ప్రత్యేకత కూడా ఆయనకుంది. ఈలపాట రఘురామయ్య, పీసపాటి నరసింహమూర్తి, షణ్ముఖి ఆంజనేయరాజు వంటి హేమాహేమీలతో కలిసి శ్రీకృష్ణుడి పాత్రను ఒకే వేదికపై పంచుకున్నారు. మొత్తం మీద ఆరు వేల ప్రదర్శనలిచ్చారు. ఆయన పద్యాలను హెచ్‌ఎంవీ, ఏవీఎం సంస్థలు గ్రామఫోన్, ఆడియో క్యాసెట్లలో విడుదల చేశారు. రెండు చిత్రాల్లో కాంతారావు, రావి కొండలరావుకు ప్లేబాక్ పద్యాలు గానం చేశారు. 2010 డిసెంబరు 26న కన్నుమూశారు.

రంగస్థల సంగీతంలో మేటి చెంచయ్య

ఏవీ సుబ్బారావు అవార్డును స్వీకరించనున్న చింతలపూడి చెంచయ్యది బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం మోదుకూరు. 1953లో జన్మించారు. తండ్రి చింతలపూడి వెంకటేశ్వర్లు దగ్గర కర్ణాటక సంగీతం, వేదగిరి పూర్ణచంద్రరావు శిష్యరికంలో హిందూస్తానీ సంగీతం సాధన చేశారు. 18 ఏళ్ల వయసులో సాంఘిక నాటకాలకు హార్మోనిస్టుగా పనిచేశారు. తర్వాత పౌరాణిక నాటకాలకు మళ్లారు. తొలుత సుబ్రహ్మణ్యశాస్త్రి, కె.హరిప్రసాద్, పి.లక్ష్మణరావు, దశరథ రామయ్య వంటి సుప్రసిద్ధ కళాకారులకు వాయిద్య సహకారం అందించారు. ఏవీ సుబ్బారావు, ఆయన కుమారులకు వాయిద్య సహకారం అందించిన చెంచయ్య ప్రస్తుతం ఆ కుటుంబంలో మూడో తరానికి చెందిన ఆరాధ్యుల నాగరాజుకు సహకరిస్తున్నారు. 2007లో యోగి వేమన నాటకానికి సంగీత దర్శకుడిగా రాష్ట్ర ప్రభుత్వం నంది బహుమతిని స్వీకరించారు.

మానవత సంస్థ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

తెనాలి: అభాగ్యుల వ్యథ తీర్చే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని, మరింతగా విస్తరణకు కృషి చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. మానవత సంస్థ, తెనాలి శాఖ ఆవిర్భవించి తొలి వసంతం పూర్తయిన సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆయన పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటైన సమావేశంలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఓదార్చి ఒక కన్నీటి బొట్టునైనా ఆపడం మానవతా ధర్మమన్నారు. ఆ లక్ష్యంతో ప్రారంభించిన సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 112 శాఖలు, 76 వేల మందికి పైగా సభ్యులతో విస్తరించటం సంతోషంగా ఉందన్నారు. ఏడాది కాలంలో తెనాలి శాఖ నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. రానున్న ఏడాదిలో మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్లాలని సూచించారు. మరోవైపు మానవత సభ్యత్వాన్ని పెంచటానికి కృషి చేయాలన్నారు. తెనాలి శాఖ ఛైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఒక ఉదాత్త ఆశయంతో ఆవిర్భవించిన మానవత సంస్థ వ్యవస్థాపకుని ఆశయాలకు అనుగుణంగా నడుస్తామని చెప్పారు. అభాగ్యుల బాధలు తీర్చటమే కాకుండా సంస్థ ఆశయాలైన పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటటం, విద్యార్థుల్లో నైతిక విలువల బోధ, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికసాయం, రక్తదాన, వైద్య శిబిరాల నిర్వహణ సంతృప్తిగా ఉందన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఓంకార ప్రసాద్, తన్నీరు శ్రీనివాసబాబు, కె.కల్యాణి, డీవీ సోమయ్యశాస్త్రి, వెంకట్, రామాంజనేయరెడ్డి, శ్రీనివాస్, వెంపటి సత్యనారాయణ, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవశించిన సంగీతాభిమానులు

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం



సంగీత, నృత్య గురువులను సత్కరించిన మాజీ మంత్రి ఆలపాటి రాజా

తెనాలి: ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలను ఆదివారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు పలువురు నృత్య గురువుల శిష్య బృందంచే నృత్య ప్రదర్శనలు, వివిధ సంగీత గురువుల బృందాలచే సంకీర్తన గానం సంగీతాభిమానులు ఆస్వాదించారు. ముందుగా నృత్య గురువులు చల్లా యామిని, పెసర్లంక వసంతదుర్గ శిష్య బృందం నృత్యాంశాలను ప్రదర్శించారు. తర్వాత సంగీత గురువులు కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి, సాల్లేటి శైలజ, మాదల గార్గి, కొండపి వసుంధర, కటకం అన్నపూర్ణ, జి.యశస్విని, గౌరవఝల ఆంజనేయశాస్త్రి, వఝల లక్ష్మీ సునీత బృందాలు సంకీర్తన గానం చేశారు. కొనసాగింపుగా గన్నె శ్రీనివాసన్ వేణు గానం, ఆకెళ్ల హిమబిందు, పెరవలి వంశీకృష్ణ బృందం లాలిపాట గానం శ్రోతలను ఆకట్టుకున్నాయి. సంగీత కార్యక్రమాలకు మృదంగంపై కేవీ రామకృష్ణ, వయోలిన్ పై చావలి శ్రీనివాస్, తబలాపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై సాయి వాయిద్య సహకారం అందించారు. ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ సంగీత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కళాభిమానులతో కలిసి కార్యక్రమాలను తిలకించారు. నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. మృదంగ విద్వాంసుడు కానూరు వెంకట రామకృష్ణ, కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేడు నృసింహస్వామి హుండీ లెక్కింపు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం చేపట్టనున్నట్లు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఎగువ దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డుపై వేంచేసి ఉన్న ఉపాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి లెక్కింపు సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ ముఖ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గత భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



రాజ్‌కుమార్‌ను సత్కరించిన సంస్థ నేతలు

తెనాలి: సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని సంస్థ హాలులో ఏర్పాటైన సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రముఖ ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలోకి వచ్చిన వారు ఆరోగ్య రీత్యా జాగ్రత్తలు తీసుకోవటం అవసరమన్నారు. వయసు రీత్యా వచ్చే సమస్యల్లో కొన్నింటిని ఫిజియో థెరపీతో నివారించవచ్చని తెలిపారు. అన్నిటికన్నా ముందు వ్యాయామం అనేది ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ దైనందిన జీవితంలో రోజూ కొంతసేపు వ్యాయామం లేదా వాకింగ్ చేయటం వల్ల చాలా ఆరోగ్య సమస్యల్నుంచి దూరంగా ఉండొచ్చని చెప్పారు. ఇదే సభలో జూన్ నెలలో పుట్టిన సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి రాజ్‌కుమార్‌ను సత్కరించారు. సభ్యులు కె.వెంకటకోటయ్య, చలమయ్య, హనుమరెడ్డి, రామ్మూర్తి, పుచ్చకాయల కోటిరెడ్డి, చెరుకూరి శివరామయ్య పాల్గొన్నారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.

శిల-శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ

నగరంపాలెం: గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ 15వ వార్షికోత్సవంలో భాగంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు రచించిన శిల-శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కాకతీయ కన్వెన్షన్ సెంటర్ అధ్యక్షులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సంజీవి హాస్పిటల్స్ డాక్టర్ అర్థలపూడి సృజన్‌కుమార్ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ ఆచార్యులు శ్రీహరి మురుగుడు, లీగల్ అడ్వైజర్ అండ్ ఫ్యామిలీ కౌన్సిలర్ మొవ్వ మృత్యుంజయరావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా 1,500 సేవా కార్యక్రమాలు, 50 గ్రంథాలు ప్రచురణ చేసిన ఘనత సంస్థదని ప్రశంసించారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ శారద

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీడీఎస్ వ్యాధుల స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారద భవనంలో నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల్నుంచి తరలి వచ్చిన 200 మందికి పరగడుపున షుగర్, బీపీ పరీక్షలు చేశారు. తర్వాత అల్పాహారం అందించి ఇతర వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, కాల్షియం, విటమిన్ మందులను నెలకు సరిపడా అందజేశారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేసినట్టయితే జీవితం ఆరోగ్యవంతంగా సాగుతుందని సూచించారు. ప్రజల్లో అవగాహన కోసం ప్రతినెల ఆదివారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని డాక్టర్ శారద వెల్లడించారు.

ఎడతెరిపిలేని వర్షం- అన్నదాతల హర్షం

వర్షాలతో విత్తు వేసిన రైతులకు ఊరట



అదునుకు వర్షం కురవడంతో కళకళలాడుతున్న మినుము



విత్తేందుకు సిద్ధం చేసుకున్న దుక్కులు

తాడికొండ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో పదును పెరగడంతో.. అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మినుము, పత్తి, జ్యూట్ ఇతర పంటలు వేసి వరుణ దేవుడి రాక కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మొన్నటి వరకు పొడిగా ఉన్న వాతావరణంతో ఎండ వేడిమి, ఉక్కపోతకు భూమి వేడెక్కి పైరు ఎదుగుదలకు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఆ వాతావరణం పోయి పూర్తిగా చల్లబడి వర్షాలు కురుస్తుండటంతో పంటలు ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు వరుసగా మే నెలలో అందే రైతు భరోసా సాయం ఈ ఏడాది ఇంకా రైతుల ఖాతాల్లో జమకాని నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సాయం లేకుండా పంటలను కాపాడుకోవడం ఎలా అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

మాదిగ మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలి




మాట్లాడుతున్న ఆలపాటి కరుణ

తెనాలిరూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ విభాగమైన మాదిగ మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని సమాఖ్య మండల నాయకురాలు ఆలపాటి కరుణ అన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల సమావేశాన్ని ఆదివారం స్థానిక ఐతానగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ కల్యాణ మండపంలో నిర్వహించారు. మహిళా సమాఖ్య నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశంలో కరుణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మాదిగ సామాజికవర్గానికి అన్ని విధాలా న్యాయం జరిగేలా మహిళా సమాఖ్య సభ్యులు పోరాడాల్సి ఉందన్నారు. ఇందు కోసం పటిష్ఠ కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సిన అవసరముందని చెప్పారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు నలుకుర్తి సద్గుణరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు కొండముది బోసు బాబు, సోపాటి రవి, సీనియర్ న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ పాల్గొన్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ పరుగు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 75 ఏళ్ల వేడుకలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఐసీఏఐ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సీఏ రన్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంపాలెంలోని రమేష్ హాస్పిటల్స్ నుంచి శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ భవన్ వరకు నిర్వహించిన పరుగులో సీఏలు పాల్గొన్నారు. ఐసీఏఐ గుంటూరు శాఖ ఛైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు చాప్టర్ ఉపాధ్యక్షుడు చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ్, సికాస ఛైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ ఛైర్మన్ మద్ది రవితేజ, సీఏలు, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిరాత నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణింపు



ఉపాధ్యాయులతో రవీంద్రనాథ్‌రెడ్డి, రామ్మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో జీవితంలో అన్ని రంగాల్లో రాణించగలరని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి-పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా చేతిరాతను అందంగా మలచుకోవాలని సూచించారు. దీని ద్వారా ఏకాగ్రత, మానసికపరమైన మార్పులు సంభవిస్తాయని తెలిపారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో తోటి ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించడాన్ని ప్రశంసించారు. విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిర్వాహకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహనరావు, ఈ.అనిల్‌కుమార్, ప్రసాద్, షాజీర్, నాగలక్ష్మి, సత్యనారాయణ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి రామస్వామి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విల్సన్

లక్ష్మీపురం: తెనాలి తాలూకా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన కాబోతు రామస్వామి భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి జీవితమంతా కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు జల్లి విల్సన్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం కాబోతు రామస్వామి 68వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో పాటు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ముప్పాళ్ల నాగేశ్వరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ రైతులు, కూలీల అభ్యున్నతికి రామస్వామి అలుపెరుగని పోరాటాలు సాగించారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాస్, రామస్వామి మనుమరాలు కోటేశ్వరి, మెడికల్ ఎంప్లాయీస్ రాష్ట్ర నాయకులు బి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.